بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 20.07.2018 (Telugu)**

## ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరుల విశ్వాసభరిత సంఘటనల ఆసక్తికర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 20.07.2018 తేదీన - మస్జిద్ మస్జిద్ బైతుల్ ఫుతూహ్-లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము**

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక అనుచరులు హజ్రత్ ఖల్లాద్ బిన్ రాఫి జర్ఖీ అన్సారి వుండిరి. బదర్, ఉహద్ యుద్ధములలో పాల్గొన్న అదృష్టవంతులలో వీరు కూడ వుండిరి. వారికి అల్లాహ్ తఆలా అధిక సంతానము నొసంగెను. ఒక కథనములో ఇట్లు గలదు. మఆజ్ బిన్ రఫా తమ తండ్రితో ఇట్లు ఉల్లేఖించిరి. నేను నా సోదరుడు హజ్రత్ ఖల్లాద్ బిన్ రాఫి వెంట రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి ఒక అతి బలహీనమైన ఒంటెపై స్వారి అయి బదర్ వైపు బయలు దేరితిమి. మేము రౌహా ప్రాంతమునకు వెనుక నున్న బరీద్ ప్రాంతమునకు చేరుకొన్నప్పుడు మా ఒంటె కూర్చొనెను. నేనిట్లు ప్రార్థన చేసితిని. ఓ అల్లాహ్! దీనిపై మమ్ములను మదీనా తిరిగి పంపినచో మేము దీనిని త్యాగము చేయుదుము. ఇంతలోనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మా వద్దకు వచ్చిరి. మీరిద్దరికి ఏమైనదని వారు సల్లల్లాహు అలైహి వసల్లం మమ్ములను అడిగిరి. విషయమంతా మేము వారికి తెలిపితిమి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మా వద్ద నిలబడిరి. వారు ప్రక్షాళనము (వజూ) చేసి మిగిలిన నీటిలో తమ ఉమ్ము వేసిరి. వారి ఆదేశముతో మేము ఒంటె నోటిని తెరిచితిమి. వారా నీటిని ఒంటె నోటిలో కొంచెం పోసిరి. అనంతరం కొంచెం దాని తలపై, దాని మెడపై దాని భుజంపై దాని కోహాన్‌పై దాని వీపు పై దాని తోకపై పోసిరి. అనంతరం వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రార్థన చేసిరి. ఓ అల్లాహ్! రాఫిని, ఖల్లాద్‌ను దీనిపై స్వారి చేయించి తీసుకెళ్ళు. తరువాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెళ్లిపోయిరి. మేము కూడ వెళ్లుటకు నిలబడి బయలు దేరితిమి. మున్సిఫ్ ప్రాంతములో మేము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకుంటిమి. ఈ బృందములో మా ఒంటె అందరికంటే ముందుండెను. మమ్ములను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చూసి చిరునవ్వు నవ్విరి. వారి సల్లల్లాహు అలైహి వసల్లం ప్రార్థనతో దాని బలహీనత పూర్తిగా దూరమయ్యెను. ఇలా నడుచుచు మేము బదర్ ప్రాంతమునకు చేరుకొంటిమి. బదర్ నుండి తిరిగి వచ్చేటప్పుడు ముసల్లా ప్రాంతమునకు మేము చేరుకొనగా ఆ ఒంటె మరల కూర్చొనెను. అప్పుడు నా సోదరుడు దానిని వధించి దాని మాంసమును పచ్చి పెట్టెను.

హజ్రత్ హార్స బిన్ సురాఖ అని మరో అనుచరుని ప్రస్తావన గలదు. వారు హిజ్రి 2వ సం॥ బదర్ యుద్ధములో మృతి చెందిరి. వారి తల్లి రబీఅ బిన్తె నజర్ హజ్రత్ అనస్ బిన్ మాలిక్ అత్తమ్మ. ప్రస్థానము కంటె ముందు తల్లితో కలిసి వీరు ఇస్లాంలో చేరిరి. అప్పటికే వారి తండ్రి మృతి చెంది వుండిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని హజ్రత్ సాయిబ్ బిన్ మజ్‌వూన్‌నకు సోదరులుగా చేసిరి. హజ్రత్ హార్స బిన్ సురాఖ తమ తల్లితో చాలా మంచిగా వ్యవహరించేవారు. నేను స్వర్గములో ప్రవేశించగా అక్కడ హార్సను చూచితినని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిరి. హబ్బాన్ బిన్ అర్ఖ బదర్ రోజున వారిని హతమార్చెను. వారు నీటి తొట్టె నుండి నీరు త్రాగుచుండగా అతడు వారిపై బాణముతో దాడి చేసెను. ఆ బాణము వారి మెడపై తగిలినందున వారక్కడే అమరులైరి. నీవు ఉదయం ఎలా లేచితివని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని అడగగా వారిట్లు వేడుకొనిరి. అల్లాహ్‌పై యదార్ధ నమ్మకముతో నేను ఉదయం లేచితిని. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఏమి అంటున్నావో గమనించుము. ఎందుకనగా ప్రతి దానికి ఒక యదార్ధముండును. ఆ యువకుడిట్లనెను. నా హృదయము ప్రపంచము పట్ల అనాసక్తి కలిగినది. నేను రాత్రంతగా జాగారము చేస్తాను. పగలంతా దాహముతో వుంటాను. అనగా ప్రార్థన చేస్తాను, ఉపవాసముంటాను. నేను నా పోషకుడైన అల్లాహ్ తఆలా సింహాసనాన్ని నా బాహ్య కనులతో చూస్తున్నాను. మేము పరస్పరం కలుస్తున్నట్లు స్వర్గవాసులను చూస్తున్నాను. ఇందుకు నరకవాసులు

అల్లరి చేస్తున్నట్లు కూడ చూస్తున్నాను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నీవిలాగే వుండుము. నీలాంటి వ్యక్తుల హృదయములలో అల్లాహ్ తఆలా విశ్వాస కాంతిని వెలిగించెను. ఓ దైవ ప్రవక్త నేను అమరుడను కావాలని నా కొరకు ప్రార్థన చేయగలరని అతడనెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి కొరకు ప్రార్థన చేసిరి. బదర్ యుద్ధములో అమరులైన మొదటి అన్సారి వీరే. హజ్రత్ హార్స అమరత్వ వార్త వారి తల్లికి అందినప్పుడు వారి తల్లి హజ్రత్ రబీఅ రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లు వేడుకొనిరి. హార్స నాకెంత ఇష్టముండెనో మీకు తెలుసు. చాలా సేవ చేసేవాడు. అతడు స్వర్గవాసులలో అయినచో నేను సహనము పాటింతును. ఇలా కానిచో నేనేమి చేస్తానో అల్లాహ్‌కే బాగుగా తెలియును. రసూలె కీరం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఓ హార్స తల్లి! స్వర్గము ఒక్కటి కాదు అనేక స్వర్గములున్నవి. హార్స గొప్ప స్వర్గమైన పిర్దౌస్ వాసులలో ఒకడు. అనంతరం వారి తల్లి నవ్వుచు, ఓహో హార్స అంటూ తిరిగి వెళ్లిపోయిరి.

మరో అనుచరుడు హజ్రత్ ఇబాద్ బిన్ బషర్ యమామ యుద్ధములో హిజ్రి 11వ సం॥ మృతి చెందిరి. హజ్రత్ ఇబాద్ బిన్ బషర్ ఉర్ఫ్ అబూబషర్, అబూ రబీ వుండెను. వారు బనూ అబ్దుల్ అష్‌హల్ తెగకు చెందినవారు. వారికి ఏకైక కుమార్తె వుండెను. ఆమె కూడ మృతి చెందెను. వారు మదీనాలో హజ్రత్ ముస్‌అబ్ బిన్ ఉమైర్ హస్తమున హజ్రత్ సాద్ బిన్ మఆజ్, హజ్రత్ ఉసైద్ బిన్ హజీర్ కంటే ముందే ఇస్లాం స్వీకరించిరి. వారిని హజ్రత్ హుజైఫ బిన్ ఉఖ్బాకు ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సోదరునిగా చేసిరి. హజ్రత్ ఇబాద్ బిన్ బషర్ బదర్, ఉహద్, ఖందక్‌తో పాటు ఇతర యుద్ధములన్నిటిలో ఆఁహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొనిరి. కాబ్ బిన్ అష్రఫ్‌ను హతమార్చుటకు పంపిన వారిలో వీరు కూడ వుండిరి.

ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరి. కాబ్‌ను బహిరంగంగా అందరి ముందట హతమార్చకూడదు. కొందరు వ్యక్తులు రహస్యముగా సముచిత సమయము చూసుకొని హతమార్చగలరు. ఓస్ వర్గమునకు చెందిన ఒక విశ్వసనీయులు ముహమ్మద్ బిన్ మసల్లమకు ఈ బాధ్యత అప్పగించిరి. ఏ ప్రణాళిక రచించినా ఓస్ వర్గ నాయకులైన సాద్ బిన్ మఆజ్ అభిప్రాయముతో రచించగలరని చెప్పిరి. ఓ అల్లాహ్ ప్రవక్త! రహస్యముగా హతమార్చుటకు ఏదో ఒక సాకు వెతకవలసి వచ్చును. తద్వారా అతన్ని అతని ఇంటి నుండి బయటికి తీసుకొని వచ్చి సురక్షిత ప్రాంతములో హతమార్చగలమని ముసల్లమ అనెను. వారిందుకు అనుమతి ఇచ్చిరి.

మౌన శిక్షపు పద్ధతిని వీడినచో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశముండెను. అందుకే సరే అని చెప్పిరి. కనుక సాద్ బిన్ మఆజ్ అభిప్రాయముతో ముహమ్మద్ బిన్ మసల్లమ అబూనాయిలతో పాటు ఇద్దరు ముగ్గురు అనుచరులను తమ వెంట తీసుకొని కాబ్ ఇంటికి చేరుకొనిరి. కాబ్‌ను లోపలి నుండి పిలిచి ఇట్లనిరి. మా నాయకుడు అనగా ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మాతో దానములు అడుగుతాడు. కాని మేము బీదలము. దయచేసి నీవు మాకేమైనా రుణము ఇవ్వగలవా? ఈ విషయము విని కాబ్ సంతోషముతో గంతులేసి అల్లాహ్ ప్రమాణము! మీరు విసిగి వేసారి ఆ వ్యక్తిని వీడే రోజు దూరము లేదని అనెను. అందుకు ముహమ్మద్ ఇట్లు సమాధానిమ్మిరి. ఏది ఏమైనా మేము ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించితిమి. ఈ సంస్థ ఫలితమెట్లుండునోనని మేము చూస్తున్నాము. కాని నీవు రుణమిస్తావా లేదా చెప్పు. కాబ్ ఇట్లనెను. ఇస్తాను కాని ఏదైనా వస్తువు కుదువ పెట్టాలి. ఏమిటని ముహమ్మద్ అడిగిరి. తమ స్త్రీలను కుదువ పెట్టండని ఆ దురదృష్టవంతుడనెను. కోపమును దిగమింగుకొని ముహమ్మద్ ఇట్లనిరి. నీ లాంటి వ్యక్తి వద్ద మేము మా స్త్రీలను ఎలా కదువపెట్టగలము. నీవు నమ్మకస్తుడివి కాదు. అటులైనచో తమ కుమారులను పెట్టండని అతడెను. ముహమ్మద్ ఇట్లనిరి. ఇది కూడ అసాధ్యమే. ఎందుకనగా మేము మా కుమారులను నీ వద్ద పెట్టి అరబ్ వాసులందరి ఎత్తిపొడుపులను భరించలేము. కాని నీవు దయతలచినచో మేము మా ఆయుధములను నీ వద్ద కుదుట పెట్టగలము. కాబ్ ఒప్పుకొనెను. రాత్రి వస్తామని ముహమ్మద్ బిన్ ముసల్లమ, వారి స్నేహితులు వెళ్లిపోయిరి. రాత్రి అయిన తరువాత తమ ఆయుధములను తీసుకొని కాబ్ ఇంటికి చేరుకొనిరి. ఎందుకనగా వారిప్పుడు బహిరంగంగా ఆయుధములను తీసుకొని వెళ్లే అవకాశము లభించెను. మాట్లాడుచు అతన్ని ఇంటి నుండి బయటికి తీసుకొని ఒక వైపు వచ్చిరి. కొంచెం దూరము నడిచిన తరువాత అతన్ని పట్టుకొని ఆయుధములున్న అనుచరులు అతన్ని హతమార్చిరి. కాబ్

హతమై పడిపోగా ముహమ్మద్ బిన్ ముసల్లమ తన స్నేహితులతో కలిసి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకొని అతని హత్య గురించి తెలిపిరి. కాబ్ హత్య వార్త వ్యాపించినప్పుడు నగరములో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడెను. తద్వారా యూదులు చాలా ఉద్రేకమునకు లోనైరి. రెండవ రోజు యూదుల ఒక బృందము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి మా నాయకుడు కాబ్ బిన్ అష్రఫ్ ఈ విధంగా హత్యకు గురైనాడని ఫిర్యాదు చేసెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి మాటలను విని ఇట్లనిరి. కాబ్ ఎటువంటి నేరములకు పాల్పడెనో మీకు తెలుసా? వాగ్దాన భంగము, యుద్ధమునకు ఉసిగొల్పుట, మోసము, అశ్లీల దూషనలు, హత్యా యత్నము వంటి కాబ్ అనేక నేరములను సంక్షిప్తముగా వారికి గుర్తు చేసిరి. కావున వారు విని భయపడి మౌనము పాటించిరి. ఆనంతరం ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మీరు కనీసం ఇకముందైనా శాంతియుతంగా వుండవలెను. శత్రుత్వము మోసము, కుట్రలకు పునాదులు వేయకుము. కనుక భవిష్యత్తు కొరకు యూదుల అంగీకారముతో ఒక క్రొత్త ఒప్పందము వ్రాయబడెను. ముస్లిములతో శాంతియుతంగా వుంటామని మోసము, కుట్రల పద్ధతల నుండి దూరముంటామని వారు క్రొత్తగా వాగ్దానము చేసిరి. వారి మాటలను విని ముస్లిములు అతన్ని హతమార్చలేదని వారు సల్లల్లాహు అలైహి వసల్లం అనలేదు. అతని నేరములను లెక్కించిరి. దాని బాహ్య ఫలితమును వారికి తెలిపిరి. అనగా అతడు తన నేరముల వలన హత్యకు గురికావలసి యుండెను. వారు నిజమే చెప్పుచున్నారని యూదులు నమ్మినందుకే వారితో ఒప్పందము చేసుకొనిరి. తద్వారా ఇటువంటి సంఘటనలు మరల జరగకుండా భవిష్యత్తులో శాంతియుత వాతావరణము ఏర్పడాలని, యూదులు ప్రతీకారమునకు దిగకూడదని, అనంతరం ముస్లిములు వారిని శిక్షించే పరిస్థితి ఏర్పడకూడదని క్రొత్తగా ఒప్పందము చేసుకొనిరి. అక్రమంగా హత్య చేయబడెనని యూదులు భావించినచో వారు ప్రతిఫలము అడిగేవారు. వారు అడగక మౌనము పాటించినందున అప్పటి చట్టము ప్రకారము ఇది సమంజసమేనని తెలియును. అతడు పాల్పడుచున్న కుట్ర హత్య కంటే పెద్దది. ఇటువంటి నేరస్తునికి ఈ విధముగా శిక్ష పడవలసి వుండెను. నేను చెప్పినట్లు అప్పటి ఆచారము ప్రకారము అతన్ని శిక్షించబడెను. మనము చూస్తున్న ఆచారము ప్రకారము కూడ ఎలాంటి అభ్యంతరానికి అవకాశము లేదని తెలియుచున్నది. ఇలా శిక్షించే అవకాశము చట్టపరంగా లేనిచో వాజ్యము వేసి బహిరంగా ఎందుకు శిక్షించలేదని యూదులు ప్రశ్న లేవనెత్తేవారు. అతని హత్య పూర్తిగా సమంజసమేనని ఈ విషయము తెలుపుచున్నది. ఇదొక శిక్ష. నేటి తీవ్రవాదులు, ప్రభుత్వములు కూడ ఇటువంటి విషయములతో తప్పుడు భావనలు తీసుకుంటున్నారు. ఇలా హత్య చేయడం సక్రమమేనని భావిస్తున్నారు. మొదటి విషయమేమనగా ఈ రకంగా మోసము జరగడం లేదు. మోసమునకు పాల్పడని వారు కూడ హత్యకు గురగుచున్నారు. రెండవ విషయమేమనగా అక్కడ అతని కుటుంబానికి కాక నేరస్తునికి మాత్రమే శిక్ష విధించబడెను. కానిప్పుడు వీరు అమాయకులను హత్య చేయుచున్నారు. స్త్రీలను హతమార్చుచున్నారు. బాలరను హతమార్చుచున్నారు. అనేకులను వికలాంగులుగా మార్చుచున్నారు. ఏది ఏమైనప్పటికి నేటి చట్టముల ప్రకరాము ఇది సముచితము కాదు. అప్పుడా శిక్ష సరియైనదే, తప్పని సరి అయినందుకు ప్రభుత్వమే విధించెను. హజ్రత్ ఇబాద్ బిన్ బషర్ గొప్ప అనుచరులలో పరిగణించబడేవారు. హజ్రత్ ఆయిషా రజియల్లాహు తఆలా అన్హా ఇట్లు తెలిపిరి. అన్సార్‌లలో ముగ్గురు అందరికంటే ఉత్తములుగా వుండిరి. అనగా హజ్రత్ సాద్ బిన్ మఆజ్, హజ్రత్ ఉసైద్ బిన్ హుజీర్, హజ్రత్ ఇబాద్ బిన్ బషర్.

హజ్రత్ ఇబాద్ బిన్ బషర్ ఇట్లు ఉల్లేఖించిరి. ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం అన్సార్లను ఉద్దేశించి ఇట్లనిరి. ఓ అన్సార్ వర్గీయులారా! మీరు నాకు షిఆర్ లాంటి వారు. అనగా దుస్తులలో అన్నిటి కంటే లోపల శరీరమునకు అంటుకొని వుండేవి. ఇతరులు పైన కప్పుకునే చద్దరు వంటి వారు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మీ తరపున బాధకు గురి చేసే ఎటువంటి విషయము ఎదురుకాదని నాకు సంతృప్తి గలదు. హజ్రత్ ఇబాద్ బిన్ బషర్ యమామ యుద్ధములో 45 సం॥ల వయసులో అమరులైరి. హజ్రత్ ఆయిషా రజియల్లాహు తఆలా అన్హా ఇట్లు తెలిపిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నా గృహములో తహజ్జుద్ నమాజ్ చదువుచుండిరి. మస్జిద్‌లో నమాజ్ చదువుచున్న ఇబాద్ బిన్ బషర్ స్వరమును నేను వింటిని. ఓ ఆయిషా! ఇది ఇబాద్ స్వరమా? అని వారు సల్లల్లాహు అలైహి వసల్లం అడిగిరి. అవునని నేను సమాధానమిచ్చితిని. వారు సల్లల్లాహు అలైహి

వసల్లం ఇట్లనిరి. ఓ అల్లాహ్ ఇబాద్‌ను కరుణించుము. వీరు హుదైబియాహ్ ప్రయాణములో వెంట వుండిరి.

ముస్లిముల పెద్ద సమూహము ముందట వుండాలని హ॥జ్రత్ ఇబాద్ బిన్ బషర్ నాయకత్వములో 20 మంది సైనికుల బృదంమును వారు (సల్లం) నియమించిరి. వారు అతి నమ్మకస్తులైన అనుచరులు. హుదైబియహ్ సందర్భమున బైఅతె రిజ్వాన్‌లో కూడ వారుండిరి. జాతుర్రిఖా యుద్ధము సమయమున నేడు మా కొరకు పహారా ఎవరిస్తారని ఆంహ॥జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అడిగినప్పుడు హ॥జ్రత్ ఇబాద్ బిన్ బషర్, హ॥జ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ ముందుకొచ్చి మేము పహారా ఇస్తామని అనిరి. ఇద్దరు ఒకరి తరువాత ఒకరు పహారా ఇచ్చిరి. రాత్రి చీకటిలో ఒక వ్యక్తి హ॥జ్రత్ ఇబాద్ బిన్ బషర్‌పై బాణముతో దాడి చేసెను. అప్పుడు వారు నమాజ్ చదువుచుండిరి. బాణము వారి శరీరములో వుండిపోయెను. అయినను వారు నమాజ్ చదువుచుండిరి. ఆ వ్యక్తి మూడు బాణములు విసిరెను. వారి రక్తము చాలా వరకు ప్రవహించెను. అయినను వారు నమాజ్ వీడలేదు. నమాజ్ పూర్తి చేసుకొని వారు హ॥జ్రత్ అమ్మార్ బిన్ యాసిర్‌ను నిద్ర లేపిరి. నీవు ముందే నన్నెందుకు లేపలేదని వారనగా నేను కహ్ఫ్ అధ్యాయము పఠించుచుంటిని. అందుకే నమాజ్ వీడదలచలేదు. వారు యమామ యుద్ధములో వీరమరణం పొందిరి.

మరో అన్సారి అనుచరుడు హ॥జ్రత్ సవాద్ బిన్ ఘజి రజియల్లాహు తఆలా వుండిరి. బనూ అది బిన్ నజ్జార్ తెగకు చెందినవారు. బదర్, ఉహద్, ఖందక్ ఆ తరువాతి యుద్ధములలో వారు పాల్గొనిరి. బదర్ యుద్ధములో వారు ఖాలిద్ బిన్ హష్షామ్ మఖ్జుమిని బంధించిరి. మరో కథనములో ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని ఖైబర్‌నకు ఆమిల్‌గా నియమించిరి. అక్కడి మంచి నాణ్యత గల ఖర్జూరములు తీసుకొని వచ్చిరి. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వారితో సాధారణ ఖర్జూరములు రెండు సేర్లు ఇచ్చి మంచి ఖర్జూరములు ఒక సేరు కొనిరి. బదర్ యుద్ధములో ఒక బాణముతో ముస్లిముల వరుసలను వారు సల్లం చక్కదిద్దుచుండిరి. వారి బాణము హ॥జ్రత్ సవాద్ యదలో కుచ్చుకొనెను. ఓ అల్లాహ్ ప్రవక్త! మీరు నన్ను అనకారణంగా బాణముతో కొట్టిరి. అల్లాహ్ ప్రమాణము నేను ప్రతీకారము తీసుకొంటానని హ॥జ్రత్ సవాద్ అనిరి. ఓ సవాద్! నీవు కూడ నన్ను బాణముతో కొట్టుమని ఆంహ॥జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అతి ప్రేమతో అనిరి. వారు తమ యదపై నుండి వస్త్రము తొలగించిరి. సవాద్ అతి అభిమానముతో ముందుకు వెళ్లి వారి యదను ముద్దాడిరి. సవాద్! నీకేమైనదని నవ్వుచూ ఆంహ॥జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అడిగిరి. అతడు గద్గధ స్వరముతో ఓ అల్లాహ్ ప్రవక్త శత్రువు ముందున్నాడు. ఇక్కడి నుండి ప్రాణాలతో బయటపడతామో లేదో తెలియదు. వీర మరణం పొందే ముందు నా శరీరమును మీ పవిత్ర శరీరమునకు తాకించాలని, ముద్దాడాలని నేను కోరుకుంటినని అనిరి. అందుకు ఆంహ॥జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి మేలు కొరకు దుఆ చేసిరి.

ఈ ప్రకాశించు తారల స్థాయి అంతస్థులను అల్లాహ్ పెంచుగాక! అరబి ప్రవక్త ప్రేమాభిమానమును అర్థము చేసుకొను భాగ్యము మనకు కూడ కలిగించుగాక!

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

..........................................................................

..........................................................................

..........................................................................